క్లుప్తంగా

అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న గండి రవి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెల పాలెం జాతీయ రహదారి కూడలిలోని అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గండి రవి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు సుందరపు అప్పారావు, ఎలమర్తి వెంకటరావు, గెంజి సురేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్‌గా ఈశ్వర్



కంచుమర్తి ఈశ్వర్

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి కంచుమూర్తి ఈశ్వర్ తూర్పు కోస్తా జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు తూర్పు కోస్తా రైల్వే డీజీఎం కౌశలేంద్ర కె.ఖదంగ ఉత్తర్వులు జారీ చేశారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌లో సమస్యల పరిష్కారం, స్టేషన్‌అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఈశ్వర్ సేవలను గుర్తించి ఈ పదవిలో నియమించారు. ఈశ్వర్‌ను దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన కుమార్తె



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సౌత్ ట్రాఫిక్ సీఐ వెంకటరావు

అగనంపూడి: వారపు సంతలో తప్పిపోయిన ఓ చిన్నారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సౌత్ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. అగనంపూడి నిర్వాసిత కాలనీలో నివసిస్తున్న భార్యభర్తలు తన మూడున్నరేళ్ల చిన్నారితో కలిసి అగనంపూడి వారపు సంతకు వచ్చారు. సంత చేసే పనిలో భార్యభర్తలు ఉండగా.. వారి పాప అక్కడి నుంచి జాతీయ రహదారిపైకి ఏడ్చుకుంటూ వచ్చేసింది. ఇది గమనించిన ఒక యువకుడు విషయాన్ని అక్కడే విధుల్లో ఉన్న సీఐ వెంకటరావుకు చేరవేయడంతో ఆయన పాపను చేరదీసి సంతలో పాప తల్లిదండ్రులకు అప్పగించారు. వారు ఆనందం వ్యక్తం చేస్తూ సీఐకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ



తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నిర్వాహకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని భారతీయ విద్యాకేంద్రం (బీవీకే) నూతన బ్లాక్ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. బీవీకే ప్రిన్సిపాల్ పి.టి.వి.జ్యోత్స్న మాట్లాడుతూ పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన బ్లాక్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. భారతీయ విద్యాకేంద్రం మరియు వాల్టేర్ రౌండ్ టేబుల్-92 సంయుక్తంగా 8 తరగతి గదులు, 2 టాయిలెట్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీవీకే కార్యదర్శి వి.ఆర్.సత్యనారాయణ, కోశాధికారి వై.శ్రీధర్, ఎస్టేట్ ఆఫీసర్ రమణమూర్తి, వాల్టేర్ రౌండ్ టేబుల్-92 డోనర్ అనికేత్ వర్మ, చైర్మన్ చైతన్య చిన్నం, ప్రాజెక్ట్ కన్వీనర్ అఖిల్ చెరుకుపల్లి తదితరులు పాల్గొన్నారు.



నెల్లిముక్కు భవిత కేంద్రంలో చిన్నారులకు పండ్లు, స్వీట్లు అందిస్తున్న ఉపాధ్యాయులు



ఇస్లాంపేట హైస్కూల్‌కు కూలింగ్ వాటర్ క్యాన్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



రామకృష్ణ స్కూల్‌లో స్వాతంత్య్ర సమరయోధులు, జాతీయ నేతల వేషధారణలో విద్యార్థులు



అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఉక్కు స్కూల్‌లో నెహ్రూ వేషధారణలో బాలలు

బాలల చేతుల్లోనే దేశ భవిత

- చిల్డ్రన్స్ డే వేడుకల్లో వక్తలు
- ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు

నేటి బాలలకు మంచి భవిష్యత్తు ఇవ్వగలిగితే, వారే రేపటి తరంలో దేశ నిర్మాణానికి తోడ్పడతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం నియోజకవర్గంలోని విద్యాలయాల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహనీయుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు.

పెదగంట్యాడ: తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం బాలల దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. 75వ వార్డు నెల్లిముక్కు భవిత కేంద్రంలో బాపూజీనగర్ ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు ఎస్.సూరిబాబు, ఎస్.జ్యోతికిరణ్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. భవిత కేంద్రం నిర్వాహకులు సూర్యనారాయణ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎంఈవో కంకటాల రమణాజీ, ఇస్లాంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ప్రమీల సూచించారు. ఈ పాఠశాల 1988–89 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాలలో పనిచేయని వాటర్‌ప్లాంట్‌కు పూర్వ విద్యార్థులు మరమ్మతులు చేయించి ప్రారంభించారు. కూలింగ్ వాటర్ క్యాన్లను అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో మంత్రి రమి, హాసన్, ఆలీ, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్‌లతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ కవిత



గాజువాక విద్యానికేతన్‌లో ఫ్యాన్సీ డ్రెస్‌లతో అలరిస్తున్న చిన్నారులు

అలరించిన విద్యార్థులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘ ప్రతినిధులు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, సంఘ ప్రతినిధులు కొలిపాక అప్పారావు, బేతా హనుమంతురావు, గంధోళి వెంకటరమణ, పైడికొండ, బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, విందుల నారాయణరావు, మజ్జి శ్రీను పాల్గొన్నారు.

- 87వ వార్డు కూర్మన్నపాలెంలోని రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణల్లో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ పొన్నాడ వాసు, డైరెక్టర్ లలితకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కణితి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మ్యాజిక్ బస్ సంస్థ విద్యార్థులకు ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందించింది. హెచ్‌ఎం సూర్యప్రకాశరావు మ్యాజిక్ బస్ సంస్థ టీఎంవో సురేంద్ర, పీడీలు ఎం.మన్నాజీ, నారాయణరావు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని గుర్తించాలని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్విజ్, వ్యాసరచన, ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

- 68వ వార్డు మింది జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ లైబ్రరీ ప్రారంభించారు. ఉపాధ్యాయులు బాలల దినోత్సవం నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఉక్కునగరం: స్థానిక శ్రిష్టి వరల్డ్ స్కూల్ మైదానంలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటిచెప్పే నాటికలు, నృత్య గీతాలు, ఉపన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల విజేతలకు పాఠశాల ఈడీ డాక్టర్ మేఘన బహుమతులు అందజేశారు. బాలలు నెహ్రూ వేషదారణలో ఆకట్టుకున్నారు. స్కూల్ డైరెక్టర్ పి.సుశీలారాణి, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపాల్ కిరణ్, క్రియేటివ్ హెడ్ రాధా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సందడి

గాజువాక: స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో చిన్నారులు సందడి చేశారు. నాయకుల వేషధారణలు, ఫ్యాన్సీ డ్రెస్ ప్రదర్శనలు, నృత్యాలు, ఆటలు, పాటలతో ఆనందంగా గడిపారు. మ్యాజిక్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ పి.భాస్కరరావు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు కె.శిరీష, బి.సునీత, శైలజ, హేమ, రాణి, మేరీ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఆర్.కవిత సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెదగంట్యాడ: మదీనాభాగ్ 11 కేవీ ఫీడర్, పరవాడ 11 కేవీ ఫీడర్, పిట్టవానిపాలెం 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పిట్టవానిపాలెం ఫీడర్ పరిధిలోని పిట్టవానిపాలెం, కేఏన్ పాలెం, పెదపాలెం, చినపాలెం, అప్రుత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందిస్తున్న కార్పొరేటర్ స్టాలిన్

గాజువాక: విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో సేవలందించిన జీవీఎంసీ గాజువాక జోన్ 72వ వార్డు పారిశుధ్య కార్మికులకు గురువారం కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో దుస్తులను సమకూర్చినట్టు తెలిపారు. వరదల సమయంలో విజయవాడలో పారిశుధ్య నిర్వహణ కోసం 72వ వార్డు నుంచి 25 మంది కార్మికులు వెళ్లి సేవలందించడం అభినందనీయమన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుడికి గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1లో జరిగిన ప్రమాదంలో విభాగం కార్మికుడికి గాయాలయ్యాయి. కార్మికుడు పల్లా సత్యనారాయణ గురువారం మధ్యాహ్నం బీ షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తుండగా జారి పక్కన ఉన్న బంకర్‌లో పడిపోయాడు. అతడి తలకు గాయమైంది. కాలర్ బోన్ ఫ్యాక్చరైంది. వెంటనే అతడిని కోక్‌ఓవెన్స్ ప్రాథమిక చికిత్స కేంద్రానికి తరలించారు. చికిత్స అనంతరం ఉక్కు జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

భెల్ నూతన జీఎంకు అభినందనల వెల్లువ



నూతన జీఎం సుబ్రహ్మణ్యంను అభినందిస్తున్న గుర్తింపు యూనియన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ విశాఖపట్నం యూనిట్ నూతన జీఎంగా బాధ్యతలు స్వీకరించిన జి.సుబ్రహ్మణ్యంను సంస్థ గుర్తింపు యూనియన్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు గురువారం అభినందించారు. హెచ్‌పీవీపీ హైదరాబాద్ యూనిట్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన్ను చాంబర్‌లో కలిసి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బొండా బాబూరావు, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, వీరబాబు, టిక్కలి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

- జీఎం సుబ్రమణ్యంకు ప్రొగ్రెసివ్ ఫంట్ నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జి.టి.పి.ప్రకాష్, ఉరుకూటి బాబూరావు, ఎస్.జగన్నాథరావు, ఆర్.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్య, ఉద్యోగావకాశాలు



విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ కరణంరెడ్డి, నాయకులు

ఉక్కునగరం: క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయని కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఈ నెల 5 నుంచి 11 వరకు జరిగిన జాతీయ కుడో పోటీల్లో హరికృష్ణ ఫిట్‌నెస్ జోన్ నుంచి వివిధ కేటగిరీల్లో పాల్గొన్న 28 మంది క్రీడాకారులు బంగారు, రజత పతకాలు గెలుపొందారు. ఈ సందర్భంగా గురువారం ఉక్కునగరంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజేతలకు ముఖ్య అతిథి కరణంరెడ్డి మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎక్కువ పతకాలు గెలుపొందడం అభినందనీయమన్నారు. క్రీడా కోటాల్లో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్ర కుడో సంఘం అధ్యక్షుడు ఎ.శిధర్ మాట్లాడుతూ భారత క్రీడా సంస్థ, రాష్ట్ర క్రీడల సంస్థ గుర్తింపు పొందిన ఏకైక క్రీడా సంస్థ కుడో అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుడో డైరెక్టర్ అనురాధ, ప్రధాన కార్యదర్శి రవిబాబు, శివకాశిరావు, కోటిరెడ్డి, నాగ యశ్వంత్, రమణ, పేర్ల అప్పారావు, కార్మిక నాయకులు రామ్మో హన్‌కుమార్, బి.సత్యనారాయణ, నాగేశ్వరరావు, బి.దిలీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని సీపీఎం ధర్నా

గాజువాక: పెరుగుతున్న ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం గాజువాక జోన్ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు బి.శ్రీను, లోకేష్, నాగేశ్వరరావు, రమణ, లక్ష్మి, గొలగాని అప్పారావు, పి.వై.వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

పెదగంట్యాడ: నిత్యావసర సరకుల ధరలను, విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ అమలకు వినతిపత్రం అందజేశారు. బి.గురప్ప, డి.వెంకటరావు, కణితి అప్పలరాజు, పాల అప్పలరెడ్డి, సోమేష్, రమణ, చారి, దేముడు, సాయి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం



గాజువాక శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న చిన్నారులు

గాజువాక: 57వ గ్రంథాలయ వారోత్సవాలు గాజువాక శాఖా గ్రంథాలయంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాల గొప్పదనాన్ని వివరించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయంలో వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు పోటీలను నిర్వహించి విజేతలకు 20న బహుమతులను అందజేస్తామన్నారు.

గ్రంథాలయాలతో బహుళ ప్రయోజనాలు

గ్రంథాలయాలతో బహుళ ప్రయోజనాలున్నాయని 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాల్లో విలువైన అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, వాటిని విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి, సాహితీవేత్త అద్దంకి రాఘవాచార్యులు, గ్రంథాలయాధికారి బి.చంద్రకళ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ గ్రంథాలయంలో..

పెదగంట్యాడ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పీవీ రమణ, నాయకులు పులి రమణారెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీలు దిబ్బపాలెం, దానబోయినపాలెం, పెద్దినాయుడుపాలెం, తలారివానిపాలెం కాలనీల్లో విషజ్వరాలతో స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో లంకెలపాలెం యూపీహెచ్‌సీ వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ నళిని పుష్పలత ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, నీరుడు పరీక్షలు నిర్వహించారు. యాంటీ మలేరియా గాజువాక యూనిట్ యాంటమాలజిస్ట్ వరహాలు దొర ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి మలేరియా పరీక్షలు నిర్వహించారు. సర్వే చేపట్టారు. కార్యక్రమంలో లంకెలపాలెం యూపీహెచ్‌సీ సిబ్బంది, వడ్లపూడి సబ్ యూనిట్ సిబ్బంది, గాజువాక యాంటీ మలేరియా యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచార ర్యాలీ



మాట్లాడుతున్న కార్పొరేటర్ చందు

గాజువాక: ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని కోరుతూ జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు 70వ వార్డులో గురువారం ప్రచారం నిర్వహించారు. ర్యాలీని కార్పొరేటర్ ఉరుకూటి చందు ప్రారంభించారు. స్వచ్ఛ విశాఖ సాధనలో భాగంగా చేపట్టిన ప్లాస్టిక్ నిషేధం అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జీవీఎంసీ గాజువాక జోనల్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, స్థానిక నాయకుడు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ తరగతులు



ఇంటర్న్‌షిప్, ఉపాధి పత్రాలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

అగనంపూడి: విద్యా సంస్థలు, పరిశ్రమల అవసరాల మధ్య అంతరాలు తొలగిపోయేందుకు డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ తరగతులు దోహదపడుతున్నాయని నిస్ట్ కళాశాల అధినేత బలుసు ఆనందరావు, వీర రాజమ్మ అన్నారు. లంకెలపాలెంలోని నోబుల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ తరగతులు ముగిశాయి. ఈసందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు జీఎల్‌ఓఎల్‌ఈడీ సంస్థలో ఇంటర్న్‌షిప్ కమ్ ఉద్యోగావకాశాలు పొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జీఎల్‌ఓఎల్‌ఈడీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సాంబిరెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి పవన్‌కల్యాణ్, కళాశాల అధ్యాపకులు హనీఫ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

ఉక్కునగరం: విధి నిర్వహణలో ఉన్న హోంగార్డుపై దాడి చేసిన కేసులో నిందితుడిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 12న బీసీ గేటు ప్రాంతంలో విధుల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్ హోంగార్డు నగిరెడ్డి సన్యాసినాయుడిపై నడుపూరుకు చెందిన చందనాటి శ్రీను దాడి చేశాడు. హోంగార్డు స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం శ్రీనును అరెస్టు చేసి అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. సీఐ కేశవరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్పీ సిబ్బంది

అగనంపూడి: లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద పట్టాలు దాటుతున్న ఒక వ్యక్తిని రైలు ఢీకొంది. ఈ సంఘటనలో అతడు దుర్మరణం పాలయ్యాడు. దువ్వాడ జీఆర్పీ ఔట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలేనికి చెందిన రొక్కం శేషగిరిరావు(51) లంకెలపాలెం కూడలిలోని ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. లంకెలపాలెంలో నివసిస్తున్న అతడు శుక్రవారం హోటల్‌కు వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జీఆర్పీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి రీజనల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య, పిల్లలకు పోలీసులు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెహ్రూ హయాంలోనే ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటు



నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉక్కు కార్మిక సంఘాల నాయకులు

అగనంపూడి: భారత మాజీ ప్రధాని, దివంగత జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేస్తే.. నేటి ప్రభుత్వాలు వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో కొనసాగుతున్న రిలే దీక్షా శిబిరం వద్ద నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం ప్రభుత్వ రంగసంస్థలను దూరదృష్టితో ఆలోచించి, ఏర్పాటు చేశారన్నారు. కానీ నేడు బడాబాబులకు కొమ్ముకాస్తూ, వారిని మరింత ధనవంతుల్ని చేయాలనే సంకల్పంతో బీజేపీ కూటమి ప్రభుత్వం తహతహలాడుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా కారుచౌకగా అమ్మడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు రామస్వామి, కొమ్ము ప్రసాద్, వరసాల శ్రీనివాసరావు, బీఎస్ రాజు, ఎస్.ఎ.నాయుడు, గోపాలరాజు, రాపల్లి కోటేశ్వరరావు, మధు, రవి, కోరిబిల్లి అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

గాజువాక: స్థానిక రాఘవేంద్ర స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు గురువారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. నేత్ర, దంత పరీక్షలు, చర్మ సమస్యలు, వినికిడి, జనరల్ సమస్యలపై సంబంధిత వైద్యులు సేవలను అందించారు. ఆరోగ్య రక్షణకు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యులు బి.కీర్తి, పంకజ్ డోంగ్రే, వై.రవితేజ, ఐ.కుందన, ఎంఈవో సునీత, పాఠశాల కరస్పాండెంట్లు బండి శ్రీనివాసరావు, కృష్ణకుమార్, గాజువాక పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ రాము, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా లేడీస్ క్లబ్ వార్షికోత్సవం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు షీలానగర్‌లో లేడీస్ వెల్ఫేర్ క్లబ్ 40వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి మాట్లాడుతూ కాలనీ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాలనీ అసోసియేషన్ కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ మహిళలందరూ ఐక్యంగా ఉండి, కాలనీ సమస్యలపై పనిచేస్తే పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో షీలానగర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.రాజు, ఉపాధ్యక్షుడు ఎస్.సత్యారావు, సుబ్బరాజు, శ్రీను, లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి సాయి లక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారి భార్యకు వేధింపులు

వ్యక్తి అరెస్ట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారి భార్యను వేధిస్తున్న కేసులో ఉక్కునగరానికి చెందిన వ్యక్తిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు అరెస్టు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-10లో నివసిస్తున్న అధికారి భార్యను అదే సెక్టార్‌లో నివసిస్తున్న కుమార్ అనే వ్యక్తి కొంతకాలంగా వేధిస్తున్నాడు. తమ పిల్లల కోసం పాఠశాలకు వెళ్తున్నప్పుడు ఆమెను వెంటాడుతున్నాడు. బుధవారం ఉదయం ఆమె ఇంటికి వెళ్లి వేధించడంతో ఆమె గురువారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తాతారావు నిందితుడు కుమార్‌ను అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.